చేసే ప్రయత్నం. జ్ఞాని బోధించి ఊరుకోడు, ఇవ్వటం కూడా ప్రారంభిస్తాడు. అక్కడ తిరిగి ఆశించటం ఏమీ ఉండదు ఎందుచేతనంటే తనకంటే భిన్నంగా ఏదీ లేదు. మీకు ఉన్న డబ్బు వలన, చదువు వలన మీ దుఃఖం పోదు. డబ్బు ఉంటే బజారులో ఉన్న వస్తువులు కొనుక్కోవచ్చు, శరీరానికి సంబంధించిన భోగాలు అనుభవించవచ్చు అంతేగాని మీ డబ్బు సత్యానుభవం పొందటానికి ఏమీ ఉపయోగపడదు. మీ డబ్బు దేహానికి కంఫర్టు తీసుకొని వస్తుంది కాని మనస్సుకు కంట్రోలు తీసుకొని రాలేదు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 14-11-2010, తణుకు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం రాళ్ళకు ఇచ్చే విలువ మనుషలకు ఇవ్వటంలేదు. రాతిమనుషలకు రాతి దేవుళ్ళే ఉండాలి అన్నారు భగవాన్. కొంతమంది మనసులు రాతిలా ఉంటాయి, వారికి రాతి దేవుళ్ళే పనికి వస్తారు కాని మామూలు మనుషులు పనికిరారు. మన దేశంలో భక్తులకు కూడా రాతి దేవుళ్ళు అంటేనే ఎక్కువ ఇష్టం. దేవుడిని పొగడటం, దేవుడికి స్తోత్రాలు చేయటం నేర్చుకొన్నాము కాని ఒక మనిషికి ఉపయోగపడటం నేర్చుకోలేదు. ఆ అలవాటు మనకు లేదు. నేను జపం చేసుకొంటున్నాను, ఆ జపం ఎంతకాలం చెయ్యాలి, ఏ దేవుడినైతే జపం చేస్తామో ఆ దేవుడి రూపం కూడా దగ్గరగా పెట్టుకోవాలా అని అడుగుతున్నారు. రూపం కంటే నామం గొప్పది. మీకు నామం మీద మనస్సు నిలబడుతూ ఉంటే రూపం అక్కరలేదు. కాని నామం మీద మీ మనస్సు నిలబడకపోతే అప్పుడు రూపాన్ని సపోర్టుగా పెట్టుకోండి, అందులో ఆక్షేపణ లేదు. అయితే జపం ఎంతవరకు చెయ్యాలి అంటే అది సహజం అయ్యేవరకూ చెయ్యాలి. ఇప్పుడు మనం ముక్కుతో గాలి తీసుకొంటున్నాము. అక్కడ మన ప్రయత్నం ఏమీ లేదు. గాలి తనంతట తాను లోపలకు వెళుతోంది, బయటకు వస్తోంది, అంటే సహజంగా జరుగుతోంది. అలాగే మీ ప్రయత్నంతో సంబంధం లేకుండా లోపల జపం నేచురల్‌గా, నార్మల్‌గా జరిగిపోతూ ఉండాలి. మీకు రాత్రి మెలుకువ వచ్చింది అనుకోండి, అప్పుడు మీకు ఏదీ జ్ఞాపకం రాకూడదు, మీరు చేస్తున్న నామమే మీకు జ్ఞాపకం రావాలి. ఇది కాకుండా ఇంకోటి జ్ఞాపకం వస్తే మీకు జపం సరిగ్గా సాగటంలేదు అని అర్థం.

మీ మనస్సును ముక్కు దగ్గర పెట్టుకొని లోపలకు వెళ్ళేగాలి, బయటకు వచ్చేగాలి చూసుకోండి. అప్పుడు మనస్సుకు కొంచెం శాంతి కలుగుతుంది. మనస్సుకు ఏకాగ్రత వస్తుంది, మీకు రక్తపోటు ఉంటే తగ్గిపోతుంది. అశాంతి వలన రక్తపోటు పెరిగిపోతుంది. మీరు శాంత చిత్తము కలిగి ఉండాలి. అనుకూలమైన భార్య దొరకటం కంటే, నచ్చిన ఉద్యోగం దొరకటం కంటే శాంతచిత్తము కలవాడు అదృష్టవంతుడు అని రాధాకృష్ణన్‌గారు చెప్పారు. శాంతచిత్తము

కలవాడికి యోగం ఫలిస్తుంది, వాడు సిద్ధిని పొందుతాడు. నువ్వు చేసే జపం సహజం అయ్యేవరకు చెయ్యాలి. జపం సహజం అయితే అప్పుడు నీకు లోచూపు కలుగుతుంది. అప్పుడు లోపలఉన్న గురువు మిమ్మల్ని లోపలకు లాక్కొని తన స్వరూపాన్ని మీకు ఇస్తాడు. అప్పుడు మీ కళ్లకు కనిపిస్తున్న ఈ ప్రపంచం అంతా కూడా ఒక గడ్డిపరకతో సమానంగా కనిపిస్తుంది. అప్పుడు ఎవరైనా చనిపోయినా మీకు ఏమీ అనిపించదు. ఈ శరీరం ఉన్నా ఏమీ అనిపించదు, శరీరం పోయినా ఏమీ అనిపించదు. ఈ చావుపుట్టుకలు అంతా ఒక లీల, ఇది ఒక ఆట అని నీకు తెలుస్తుంది. మనిషి పుట్టాడు అంటే వాడు చనిపోయి తీరతాడు, వాడు చనిపోయాడు అంటే మరల పుడతాడు. పుట్టినవాడు చనిపోవటం ఎంత నిజమో చనిపోయినవాడు తిరిగి పుట్టటం కూడా అంతే నిజం. అయితే అది మీ కళ్లకు కనబడటం లేదు కాబట్టి అబద్ధం అనుకొంటారు. సూర్యుడు భూమి కంటే పెద్దవాడు కాని మన కళ్లకు చిన్న బంతిలాగ కనిపిస్తున్నాడు. మన కళ్లకు అలా కనిపిస్తున్నాడు కాబట్టి ఇంతే ఉన్నాడని అనుకొంటాము. ఇంద్రియాలకు కనిపించేది అంతా నిజంకాదు. మనిషి చనిపోయాడు అంటే నీ ఇంద్రియాలకు వాడు చనిపోయినట్లు కనిపిస్తున్నాడు. స్మశానంలో వాడి శరీరం కాలిపోతుంది కాని ఈ దేహమే నేను అనుకొనేవాడు ఒకడు లోపల ఉన్నాడు కదా వాడు కాలడు, వాడు అలాగే ఉంటాడు. అక్షరమణమాలలో రమణస్వామి ఏమన్నాడు అంటే భౌతికమైన అగ్ని ఈ జడశరీరాన్ని కాల్చిబూడిద చేయకముందే నీ జ్ఞానాగ్నిని పంపించి నాలో ఉన్న అజ్ఞానాన్ని కాల్చిబూడిద చెయ్యి అరుణాచలేశ్వరుడా అన్నారు. బాహ్యంగా మీకు ఎన్ని గొప్పలు ఉన్నా, ఎంత ఐశ్వర్యం ఉన్నా లోపల అజ్ఞానం ఉంటే ఏమీ ప్రయోజనం లేదు, ఇవన్నీ ఒకటి లేని సున్నలతో సమానము. ముందు లోపల ఉన్న అజ్ఞానంలో నుండి మనం విడుదల పొందాలి.

మీ అమ్మాయి అమెరికాలో ఉంది అనుకోండి. మీ అమ్మాయిని జ్ఞాపకం చేసుకోవటానికి మీరు ఏమైనా సాధన చేస్తున్నారా? ఏమీ సాధన చెయ్యకుండానే జ్ఞాపకం వస్తోంది. మీరు వంట చేసుకొంటున్నా, ఎవరితోనైనా మాట్లాడుతూ ఉన్నా కూడా మీ అమ్మాయి జ్ఞాపకం వస్తోంది కదా. అంటే అక్కడ ఉన్న ప్రేమవలన, మమకారం వలన అలా జరుగుతోంది. అలాగే నువ్వు ఎక్కడ ఉన్నా, ఏ పనిచేస్తున్నా నువ్వు చేసే నామం నీకు జ్ఞాపకం రావాలి, భగవంతుడు అప్రయత్నంగా మీకు జ్ఞాపకం వస్తూ ఉండాలి. అలా రావటంలేదు అనుకోండి మీ అమ్మాయిమీద ఉన్న ప్రేమ కూడా భగవంతుడిమీద మీకు లేదు. భగవంతుడు మనకు శాంతిదాత, కాంతిదాత, ఆయనే మనకు పెద్ద చుట్టం. మన శరీరం పోయినా ఆయనతో బంధుత్వం మనకు తెగదు. మనకు ఆత్మజ్ఞానం కలిగేవరకూ ఆయన మనలను విడిచిపెట్టడు.

యజ్ఞాలు చాలా ఉన్నాయి. అందులో జపయజ్ఞం నేను అని పరమాత్మ చెప్పాడు. ఉన్నది సత్యం ఒక్కటే. నది ఎన్ని వంకరలు తిరుగుతూ ప్రయాణం చేసినా చివరకు వెళ్ళి సముద్రంలో కలుస్తుంది. అలాగే మీరు ఎన్ని సాధనలు చేసినా జపం, ధ్యానం, విచారణ, సజ్జనసాంగత్యం, ఈ ప్రవచనాలు శ్రవణం చేయటం, కాశీ రామేశ్వరం వెళ్ళటం, నదులలో స్నానాలు చేయటం వీటి అన్నింటిసారం ఒక్కటే, అది నీ హృదయంలో ఉన్న సత్యంలో నువ్వు ఐక్యమవ్వాలి, అదే మన గమ్యం. మన హృదయంలో ఒక సత్యం ఉంది. మన హృదయంలో ఒక సత్యం ఉందని మనకు స్ఫురిస్తూ ఉంటే దానిని పట్టుకోవాలనే బుద్ధి మనకు కలుగుతుంది. నీ హృదయంలో ఒక సత్యం ఉందని నీకు తెలియటానికి కూడా సత్పురుషుల సహవాసం లేకుండా అది నీకు సాధ్యంకాదు.

మీ ఇంట్లో వారి పట్ల మీ డ్యూటీ చెయ్యాలికాని మమకారం పెట్టుకోకూడదు. మమకారం మనుషులను చంపుతుంది, మమకారం మనుషులను తిరిగి భూమిమీదకు తీసుకొనివస్తుంది. మమకారం రోగాలను తీసుకొని వస్తుంది. మీ ఇంట్లో వారికి రోగం వస్తే వారికి వైద్యం చేయించండి అంతేగాని ఆరోగం మీకే వచ్చేసింది అనుకొంటే ఎలాగ? ఇలా జీవిస్తూ ఉంటే ఇంక మీకు జ్ఞానం ఏమిటి? దేశంలో ఎవరికైనా జబ్బు వస్తే నీకు వచ్చిందని అనుకోవటం లేదు, ఇంట్లో వారికి జబ్బు వస్తే నాకు వచ్చిందని అనుకొంటున్నావు, అదే మమకారం. మమకారం ఉన్నప్పుడు నీ మనస్సు అంతర్ముఖం అవ్వదు. మీ ఇంట్లో ఉన్న నలుగురు ఎక్కడి నుంచో వచ్చారు, కొంతకాలం కలిసి ఉంటారు, మరల బయటకు పోతారు, చనిపోయిన తరువాత ఎవరి దారి వారిదే. అందుచేత మీరు చేయవలసిన డ్యూటీ చెయ్యండి అంతవరకే, తరువాత విడిచిపెట్టేయండి. ఇవి అన్నీ లోపలకు తీసుకోవటం, బెంగపెట్టుకోవటం ఉంటే మీ ఇంటి వెనకాల పెంట ఎలా పెరిగిపోతూ ఉంటుందో అలాగ వీటి వలన మీ హృదయం అంతా పెంటతో నిండిపోతుంది, మీ హృదయం మురికి కాలువ అయిపోతుంది. హృదయం నిండా పెంట ఉంటే ఇంక మీకు జ్ఞానం ఏమిటి? మన హృదయాన్ని ఖాళీ చెయ్యాలి కాని దానిని నింపుకోకూడదు. ఉన్న గొడవలు వదిలించుకోవాలి కాని కొత్తగొడవలు తెచ్చుకోకూడదు. అందుచేత మీరు సాధ్యమైనంతవరకు ఇతరుల గొడవలలో కలుగజేసుకోవద్దు.

ఉన్నది సత్యం ఒక్కటే. దానితో నీకు తాదాత్మ్యం లేదు. సత్యంకానిదానితో తాదాత్మ్యం పొందుతున్నావు. అంటే అసత్యంతో నీకు జత ఉంది. అసత్యంలో నీకు ఉన్న జతను విడగొట్టటానికే ఈ పూజ, జపం, ధ్యానం, విచారణ ఇవన్నీ. నీకు జతగాళ్ళు ఉన్నారుకదా. ఆ జతగాళ్ళతోటి విడగొట్టటానికే సాధన అంతా. క్రమశిక్షణ లేనివారితో అసలు జతలు కట్టకూడదు. మీరు ఇంటి చుట్టూ మొక్కలు నాటుతున్నారు కదా. మీ మనస్సులో, మీ హృదయంలో

క్రమశిక్షణ, జ్ఞానము అనే మొక్కలు నాటుకోండి, అవి మీకు ప్రాణవాయువును సప్లైచేస్తాయి. ఇహంలోకాని, పరంలోకాని అభివృద్ధిలోనికి రావాలి అంటే క్రమశిక్షణ అవసరం. క్రమశిక్షణ లేనివాడు దేనికి పనికిరాడు. ఈ దేహాన్ని ఎవరు కల్పించారు. మనస్సు కల్పించింది. అందుచేత మనస్సు నిజం కింద చెపుతుంది. దొంగతనం చేసినవాడిని నువ్వు దొంగని పట్టుకోరా అంటే వాడు దొంగను పట్టుకొంటాడా. అలాగే మనస్సు కల్పించిన ఈ దేహాన్ని మనస్సు నిజమని చెపుతుంది కాని అబద్ధం అని ఎలా చెపుతుంది. మనకు మంచి స్వప్నాలు, చెడ్డ స్వప్నాలు వస్తాయి. మెలకువ వచ్చాక ఇది అంతా అబద్ధం, ఏమీ లేదు అనిపిస్తుంది. మీకు జ్ఞానం కలిగాక ఈ జన్మలు కూడా అంతే. మీకు స్వప్నంలో నుండి మెలుకువ రాగానే స్వప్నంలో కనిపించిన శరీరాలు ఎంత అబద్ధం అని తెలుస్తుందో నువ్వు అజ్ఞానంలో నుండి, బంధంలో నుండి బయటకు వచ్చాక ఈ దేహాలు కూడా అంతే అబద్ధం అని నీకు తెలుస్తుంది, అంతకంటే ఈ దేహాలకు ప్రాముఖ్యత లేదు అని తెలుస్తుంది.

మీరు ఇంటి దగ్గర కూర్చొన్నప్పడు మీకు ఎటువంటి తలంపులు వస్తున్నాయో చూసుకోండి. అందులో మిమ్మల్ని పాడుచేసే తలంపులు కూడా వస్తాయి. వాటిని జాగ్రత్తగా వదిలించుకోండి, ఆ తలంపులను నెమ్మదిగా తగ్గించుకోవటానికి ప్రయత్నం చేయండి. వేదంలో ఒక మాట ఉంది. నేను జాగ్రదవస్థలో ఉన్నా, స్వప్నావస్థలో ఉన్నా, కళ్ళు మూసుకున్నా, కళ్ళు తెరిచినా, ఏదిక్కుకు చూసినా నాకు మంచి తలంపులు వచ్చేటట్లు అనుగ్రహించు తండ్రీ అని ఉంది. మంచితనానికి మారుపేరే జ్ఞానం. మంచితనం లేనివాడికి జ్ఞానం కలిగే అవకాశం లేదు. మనం లౌకికులతో అతిగా ఉండకూడదు. మనకు సంబంధం లేని విషయాలలో ఎక్కువగా కలుగజేసుకోవద్దు. లోకవిషయాలలో అతిగా ఉంటే అహంభావన పెరిగిపోతుంది, వ్యక్తిభావన పెరిగిపోతుంది. మన హృదయంలో ఒక నిజం ఉంది. దానిని తెలుసుకోవటానికి ఏ విషయాలు అయితే మీకు అడ్డు వస్తున్నాయో చూసుకోండి. వాటిని నెమ్మదిగా ఒక దాని తరువాత ఒకటి తొలగించుకోవటానికి ప్రయత్నం చేయండి. భగవాన్ ఏమంటున్నారు అంటే మీ ఇంట్లో ఏమి వస్తువులు ఉన్నాయో నేను చెపితేగాని మీకు తెలియదా అలాగే నీలో ఏ బలహీనతలు ఉన్నాయో నేను చెప్పాలా మీకు అవి తెలియటంలేదా? కొంచెం అబ్జర్వేషన్ ఉంటే మీలో ఉన్న బలహీనతలు మీకు తెలుస్తాయి. అవి ఏదోరోజున తలంపు కింద వచ్చేస్తాయి. ఈ బలహీనత ఉన్న మూలంగా ఈ తలంపు వస్తోంది అని తలంపు వచ్చినప్పడు పట్టుకొని దానిలో నుండి బయటకు రావటానికి ప్రయత్నం చేయాలి. అదీ సాధన అంటే. మీరు సబ్జక్టు బాగా అర్థంచేసుకొంటూ ఉంటే మీకు బండెడు అశాంతి ఉన్నా అది అంతా కాలిపోతుంది. మీలో ఎంత అశాంతి ఉన్నా గురువు పీల్చేసుకొంటాడు. మీలో ఉన్న అశాంతిని కుటుంబ సభ్యులు పీల్చుకోలేరు ఎందుచేతనంటే అది వారికి చేతకానిపని అంతేగాని వారు చెడ్డవారు అనికాదు.

మనుషుల దగ్గర ఉన్న బలహీనత ఏమిటి అంటే వారు ఏదైనా చిన్న పని చేస్తే అది అందరికి తెలియాలి అనుకొంటారు, ఇంట్లో కూడా పని చేస్తూ గుర్తింపు కావాలి అనుకొంటారు. అలా జీవిస్తూ ఉంటే మీరు ఎంత సాధన చేసినా మీకు జ్ఞానం కలుగదు. ఎవడైతే గుర్తింపులు కోరుకొంటున్నాడో వాడే సైతాను, వాడిని లోపల పెంచుకొంటూ మీరు సాధన చేసినా ప్రయోజనం లేదు. నువ్వు ఏ కోరిక లేకుండా ఇతరులకు సహకరిస్తున్నావు అనుకో అప్పుడు చిత్తశుద్ధి కలుగుతుంది. ఏదైనా కోరికతో సహకరిస్తున్నావు అనుకో ఈనాటికైనా, ముందునాటికైనా అది నిన్ను బంధిస్తుంది. చిత్తశుద్ధి అనే గుమ్మం ద్వారానే నువ్వు ఆత్మజ్ఞానాన్ని పొందాలి, ఇంకో గేటులేదు. నువ్వు ఎంతపవిత్రం అవ్వాలి అంటే నీ లోపల ఉన్న సద్వస్తువు ఎంత పవిత్రమైనదో నీ మనస్సు అంత పరమపవిత్రం అయితే కాని నువ్వు తదాకారం పొందలేవు. ఏదో అక్కడ సత్రంకట్టించాము, ఇక్కడ కాలువ తవ్వాము అంటే అవి చేస్తే చేయవచ్చు. సత్యజ్ఞానం పొందకుండా ఈ శరీరం చనిపోతే నువ్వు ఏమి సాధించినట్లు. స్వప్నంలో కూడా మనకు ఎవరైనా ఉపకారాలు చేస్తే సంతోషిస్తాముకదా, ఈ లోకంలో చేసే ఉపకారాలు కూడా అటువంటివే. నువ్వు ఏ పని చేసినా గుర్తింపులకోసం చెయ్యవద్దు, చిత్తశుద్ధికోసం చెయ్యి, నువ్వు పవిత్రుడవు అవ్వటానికి పనిచెయ్యి. మేము పవిత్రులం అని మీరు అనుకోవటంకాదు, ఈశ్వరుడు అనుకొంటే అప్పుడు ఆయన మీకు తెలియబడతాడు. మనం ఏ పని చేసినా అంతర్యామిని సంతృప్తిపరచటానికి, ఆయనను సంతోషపరచటానికి చెయ్యాలి కాని బయట మెప్పులకోసం మీరు పనులు చెయ్యవద్దు. ఇందులో ప్రమాదం ఏమిటి అంటే బయట మెప్పులకోసం, గొప్పలకోసం పనులు చేస్తూ ఎంతదూరం వెళ్ళిపోయారో మరల అంతదూరం వెనక్కివచ్చేవరకూ మీకు అసలు జ్ఞానం రాదు. మీ స్వరూపాన్ని విడిచిపెట్టి లేనిపోని విషయాలు కల్పించుకొని ఎంతదూరం బయటకు పోయారో అంతదూరం వెనక్కి రాకుండా మీరు హృదయగుహలో పడరు.

ఇప్పుడు మనకు అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయి అనుకోండి, రోజులు బాగా వెళ్ళిపోతున్నాయి అనుకోండి, ఈ జన్మ బాగా వెళ్ళిపోతే అంతా అయిపోయినట్లేనా. ఇలా మనం ఇంకా ఎన్ని శవాలను మోయాలో. స్వరూపజ్ఞానం కలిగేవరకూ శవాలు రాకుండా ఎవరూ ఆపలేరు. అందుచేత మీరు ఒకమాట మాట్లాడితే, చేతితో ఒక పనిచేస్తే, మనస్సుతో ఏదైనా ఆలోచిస్తే ఇవి అన్నీ ఈశ్వరుని దయను సంపాదించటానికి నీకు సహకరించాలి. ఆ రకంగా మనం జీవించాలి. ఈశ్వరుని దయ ఉంటే మనకు అన్నీ ఉన్నట్లే. మనం జపం నోటితో చెయ్యవచ్చు అంతకంటే మానసిక జపం మంచిది. రాత్రి నిద్రపోయేముందు జపం చేస్తే మీకు అక్కరలేని తలంపులు ఆగిపోతాయి, నిద్రతొందరగా వచ్చేస్తుంది, మీకు తెలియకుండా

మీ మనస్సు వెళ్ళి గూటిలో పడిపోతుంది. మనకు మూఢనమ్మకాలు ఎక్కువ. మనకు పని చేయటం చేతకాదు, ఏది చేతనవును అంటే గెడపదాటేటప్పుడు ఎడమకాలు ముందు వేయాలా, కుడికాలుముందువేయాలా ఇటువంటి గొడవలు ఎక్కువ. మనం పొరపాటున ఎడమకాలు వేసాము అనుకోండి ఇంక ఆ పని అవ్వదు అనుకోవటం, ఇవి అన్నీ మూఢ నమ్మకాలే. రాత్రి నిద్రపోయేముందు మీకు తెలియకుండా మీ మనస్సు అమృతనాడి ద్వారా ఈశ్వరుడు ఎక్కడ ఉన్నాడో అక్కడికి వెళ్ళిపోతుంది. అంటే హృదయగుహలో పడిపోతుంది. రోజూ నిద్రలో అది జరుగుతూ ఉంటుంది కాని అది మనకు తెలియదు. ఇక్కడ జాగ్రదవస్థలో ఎరుకతోటి మన మనస్సు అమృతనాడి ద్వారా హృదయగుహలోనికి వెళ్ళిపడాలి. అప్పుడు మనకు ఆత్మజ్ఞానం కలుగుతుంది.

మీకు లోపల జపం అప్రయత్నంగా, సహజంగా జరుగుతూ ఉండాలి. తుకారామ్, జ్ఞానేశ్వర్ వంటివారు జపంచేసి సిద్ధిని పొందారు. వారు చేసేది సిన్సియర్‌గా, డెడికేటెడ్‌గా చేసారు. జపం వలన మనం పొందవలసింది పొందుతామా లేదా అనే అనుమానం లేకుండా చేసారు. జపం చెయ్యకుండా, ధ్యానం చెయ్యకుండా, సత్కర్మ చెయ్యకుండా ఉండే తలకాయలు ఉంటాయి. వాటిని దెయ్యాలకొంపలు అంటారు. అంటే ఆ తలకాయలో దెయ్యాలు కాపురం చేస్తాయి. జాగ్రదవస్థ అంతా నువ్వు భగవదనుభవం పొందటానికి తగిన ప్రయత్నం చేస్తూ ఉండాలి. నువ్వు ప్రయత్నం చెయ్యవు అనుకో ఇంక నీ మనస్సు దెయ్యాలకొంప. మీరు బ్రాహ్మీస్థితి పొందిన తరువాత మీ శరీరానికి చావు వచ్చింది అనుకోండి మీరు ఆనందప్రవాహంలో ఓలలాడుతూ ఉంటారు, ఎప్పుడో ఆ శరీరం జారిపోతుంది. ఆ శరీరం జారిపోయినప్పుడు మీకు ఆనందంతో తాదాత్మ్యం ఉంటుంది కాని శరీరంతో తాదాత్మ్యం ఉండదు. అప్పుడు మేము చనిపోతున్నాము అనికాని, ఏదో పోగొట్టుకుంటున్నాము అని కాని మీకు అనిపించదు. శరీరం ఉన్నప్పుడు ఆనందప్రవాహంలో ఎలా ఉన్నారో శరీరం పడిపోయిన తరువాత కూడా ఆనంద ప్రవాహం అలా కంటిన్యూ అయిపోతుంది. శరీరం ఉండటానికి, శరీరం పోవటానికి తేడా ఏమీ ఉండదు. ఈ శరీరాన్ని అబద్ధం అని ఎందుకు అన్నారు అంటే పుట్టకముందు ఈ శరీరం లేదు, చనిపోయాక కూడా ఉండదు. అందుచేత ఇది సత్యంకాదు. ఒక ప్రాంతంలో ఉండి ఇంకో ప్రాంతంలో లేకపోతే, ఒకకాలంలో ఉండి ఇంకో కాలంలో లేకపోతే అది ఏదీ నిజంకాదు. అన్ని ప్రాంతాలలో, అన్ని కాలాలలో ఉండాలి, అదే పారమార్థిక సత్యం.

చనిపోయాక ఇతర లోకాలకు వెళ్ళేవారు కూడా అబద్ధం అని మీరు అంటున్నారు, మరి నేను చనిపోయాక ఎక్కడ ఉండాలి అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. నువ్వు ఎక్కడ ఉండాలి అని నన్ను అడుగుతున్నావు. నువ్వు ఎక్కడ లేవో నాకు చెపితే ఎక్కడ

ఉండాలో అప్పుడు నేను చెపుతాను. నువ్వులేని చోటు అంటూ ఉంటేకదా అక్కడికి వెళ్లటానికి. నువ్వు అంతటా ఉన్నప్పుడు ఇంక ఎక్కడికి వెళతావు. నీకు కమింగ్‌లేదు, గోయింగ్‌లేదు. శరీరం చనిపోయేటప్పుడు నేను చనిపోతున్నాను అనుకొనేవాడికి తప్పక పునర్జన్మ వచ్చి తీరుతుంది. నీ ముక్కులో నుండి గాలి బయటకు పోయేటైముకు, ఏ వస్తువుకు అయితే చావు లేదో దానితో కనుక నీకు తాదాత్మ్యం వస్తే నేను ఎక్కడికీ వెళ్లటంలేదు అని వాడికి అనుభవం వస్తుంది. అప్పుడు శరీరం జారిపోయినా నీకు పునర్జన్మలేదు. చనిపోవటం అంటే కంగారుపడకండి. మనం ఇంట్లో ఒక గదిలో నుండి ఇంకో గదిలోనికి ఎలా వెళతామో అలాగే ఈ జీవలక్షణాలు ఉన్నవాడు ఒక శరీరంలో నుండి ఇంకో శరీరంలోనికి వెళతాడు, అదే తిరిగి పుట్టటం. శరీరాలు మారతాయికాని జీవలక్షణాలు అలాగే ఉంటాయి. ఈ శరీరంలో ఉండగానే సాధన చేసి ఈశ్వరుని దయవలన ఈ జీవలక్షణాలను ఎవడైతే పోగొట్టుకొన్నాడో వాడిని జీవన్ముక్తుడు అంటారు.

ఇప్పుడు మనకు తలంపులు వస్తున్నాయి కదా. ఈ తలంపులు ఎక్కడనుండి వస్తున్నాయి ఎందుకు వస్తున్నాయి, దేనికారణంగా వస్తున్నాయి అని మీరు వెనక్కి వెళ్లి ఆలోచిస్తే మీ దేహమే కారణం అవుతుంది. ఈ దేహబుద్ధి పోయవరకూ ఎవరికీ ఆత్మానుభవం కలుగదు. కొంతమంది గౌరవం వస్తుంది అంటే గాని పని చెయ్యరు. నాకు గౌరవం కావాలి అనే తలంపు ఎందులోనుండి వస్తోంది అంటే దేహబుద్ధిలో నుండి వస్తోంది. అంటే వాడి పతనానికి దేహబుద్ధి కారణం. తొందరపడిముందుకు వెళ్లిపోవటంకాదు. మీరు బాగా ఎనాలసిస్ చేసుకోండి. ఎనాలసిస్ చేసుకొంటే ఇప్పడే ఇక్కడే అది పేలిపోతుంది. ఒక పండితుడు బోటులో రేవు దాటుతున్నాడు. ఆ బోటు నడిపేవాడిని ఏమయ్యా నువ్వు ఫిజిక్స్ చదువుకొన్నావా, కెమిస్ట్రీ చదువుకొన్నావా అని పండితుడు అడుగుతున్నాడు. నేను ఏమీ చదువుకోలేదు అని ఆ బోటు నడిపేవాడు చెప్పాడు. ఆ పడవకు చిల్లులు ఉండి అందులోనికి నీరు వచ్చేసి పడవ మునిగిపోతోంది. ఏమండీ ఆచార్యులవారు మీకు ఈత వచ్చునా అని అడిగాడు. నాకు ఈతరాదు అని ఆ పండితుడు చెప్పాడు. నాకు ఫిజిక్సు తెలుసు, కెమిస్ట్రీ తెలుసు అంటే ఇప్పుడు అవి మిమ్మల్ని రక్షించవు, ఇప్పుడు మీకు ఈత కావాలి, ఈతరాకపోతే మీరు గంగపాలు అన్నాడు. అలాగే నీకు అన్నీ తెలుసుకాని నీకు దేహబుద్ధి పోలేదు, ఇంక వాటివలన ప్రయోజనం ఏమిటి? ఎన్ని విద్యలు మీరు నేర్చుకొన్నా దేహబుద్ధి కనుకపోకపోతే మృత్యువు వచ్చి మిమ్మల్ని కబళిస్తుంది అంటే మరణం చేతికి మీరు దొరికేస్తారు. ఈ దేహం నిజం అనుకొంటున్నారు కాబట్టి లోకం నిజం కింద కనిపిస్తుంది. దేహం, లోకం నిజంకింద కనిపించినప్పుడు చావు కూడా నిజం కింద అనిపిస్తుంది. ఈ అడవిలోనుండి నువ్వు బయటకు రావాలి అంటే దేహబుద్ధి

నశించకుండా నువ్వు కోటిజన్మలు ఎత్తినా ఇందులో నుండి బయటపడలేవు. దేహబుద్ధి నశించకుండా నీకు ఆత్మబుద్ధి కలుగదు. ప్రతీవాడు గౌరవంకావాలి అనుకొంటున్నాడు. మీరు ఉన్నారు కాబట్టి ఇతరుల దగ్గర నుండి గౌరవం కోరుకొంటున్నారు. అసలు మీరే లేరని తెలుసుకొన్నప్పడు ఇంక ఇతరులు లేరుకదా అప్పడు ఇంక గౌరవం ఎవరి దగ్గర నుండి కోరుకొంటారు. సాధనచేసి మనిషి రాగద్వేషాలలో నుండి బయటకు రాగలడు కాని కీర్తి కాంక్షలో నుండి బయటకు రాలేడు అని మిల్టన్ చెప్పాడు. దేహబుద్ధి వేరుతోసహా నశిస్తేనే గాని వాడికి కీర్తి కాంక్ష పోదు.

మీరు ఎంత మంచివారు అయినా, మీరు ఎంత బుద్ధిమంతులు అయినా, ఇతరులు మీకు ఎన్ని అపకారాలు చేసినా తిరిగి వారికి అపకారం చేసే స్వభావం మీకు లేకపోయినా, మంచితనమే అలా రూపం ధరించి వచ్చిందా అనుకొనేటంత మంచితనం మీకు ఉన్నా దేహబుద్ధి మీకు పోలేదు అనుకోండి ఇంక మీకు ఆత్మజ్ఞానం కలుగదు. మీరు నిజంగా మంచివారే అయినా ఇక్కడ భగవంతుడు మీతో రాజీపడడు, ఆ కీలకం మీరు పట్టుకోండి. మీకు ప్రపంచం అంతా గౌరవం రావచ్చు, మీ పేర్లు పుస్తకాలలో, పేపర్లలో వ్రాయవచ్చు. అయినా మీకు దేహబుద్ధి పోకపోతే మీకు ఆత్మజ్ఞానం కలుగదు. వివేకానందుడు చిన్నతనంలో రామకృష్ణుడితో మాట్లాడుతూ మీకు చదువులేదు, ఈశ్వరచంద్ర విద్యాసాగరుడు లాంటి బాగా చదువుకొన్న వారి గురించి వారి గొప్పతనం గురించి మీకు చదువులేని మూలంగా తెలియటం లేదు అని చెప్పాడు. ఒరే బుల్లి నరేన్ నువ్వు చెప్పేదీ రైటే, వారు గొప్పవారని నేనూ వింటున్నాను కాని వారు ఉత్తఉత్త గొప్పవాళ్ళు, లోపల సరుకులేని గొప్పవాళ్ళు. వాళ్ళు నిజంగా గ్రేట్‌కాదు, గ్రేట్ అనిపిలవబడే గ్రేట్ అని చెప్పాడు. మనం అటువంటి మాటలు అనలేము. ఈ మాటలు చెప్పటానికి ఎంత ధైర్యం ఉండాలో చూడండి. వరల్డ్ హిస్టరీలో వ్రాసారండీ వీరు పేర్లు అని చెపితే వారు ఎంత గొప్ప వారు అయితే ఎవడికి కావాలి, వారు అసత్యాన్ని సత్యం అనుకోవటం మానలేదు, వారికి దేహబుద్ధి పోలేదు, వారు మీ కళ్ళకు గొప్పవారికింద కనిపించవచ్చు కాని ఉత్తఉత్త గొప్పవాళ్ళు అని చెప్పారు. నరేంద్రుడికి చిన్నతనం కదా ఆయన మాటలు అర్థం చేసుకోలేక కలకత్తాలో అందరూ ఈయనను పిచ్చవాడు అని చెప్పకొంటున్నారు, ఈయన నిజంగా పిచ్చవాడే అనుకొనేవాడు. ఈ మధ్యన ఒక అమ్మగారితో ఫోనులో మాట్లాడుతూ సాధన బాగా చేసుకొంటున్నారా అని అడిగాను. ఏదో చేసుకొంటున్నాను అనుకోండి నాన్నగారు. ఇటు నుండి ఏమి వస్తుంది, వచ్చేది అంతా అటునుండే రావాలి కదా. నేను చేసే సాధన ఎంత? నా బతుకు ఎంత? ఇటునుండి వచ్చేది తక్కువే, అసలు వచ్చేది అంతా అటునుండే రావాలి. ఈ మనస్సు కుదురుగా ఉండదు కదా, ఈ మనస్సు ఎంత చేయగలదు, రావలసింది అంతా పరమేశ్వరుడి దగ్గర నుండే రావాలి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| డిసెంబర్ | 5 | గొరగనమూడి, జ్ఞానానంద ఆశ్రమం |
| డిసెంబర్ | 11 | జిన్నూరు, శ్రీ రమణ క్షేత్రం (సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి) |
| డిసెంబర్ | 17 | కాపవరం, గీతాజయంతి |
| డిసెంబర్ | 23 | జిన్నూరు, శ్రీ రమణ క్షేత్రం (శ్రీ భగవాన్ జయంతి) |
| డిసెంబర్ | 30 | ఐ-భీమవరం |

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

- Mahabharatha

# గురువందనం

ఆధునిక మానవాళికి గొప్ప ఆధ్యాత్మిక వరం భగవాన్ శ్రీరమణమహర్షి. ప్రతి సంవత్సరం మాదిరిగానే ది॥ 23-12-2010న శ్రీరమణజయంతిని జరుపుకోబోతున్నాం! భగవాన్ శ్రీ రమణుల బోధాసారాన్ని ఆధ్యాత్మిక స్ఫూర్తిని ఎంతవరకు ఇముడ్చుకున్నాం? అన్నదే ప్రశ్న! అలగమ్మ, సుందరం అయ్యరు పుణ్యదంపతుల బిడ్డగా తిరుచ్చుళిలో ది॥ 30-12-1879న ఒక దేహం ధరించిన తరువాత, తన 17వ సంవత్సరంలో మధురైలో మరణానుభవం కలిగిన కొద్ది రోజులకే అనగా ది॥ 01-09-1896న వారి ఉపాధి అరుణాచలం చేర్చబడింది.

మరణానుభవానికి, మహానిర్వాణానికి మధ్య ఏబదినాలుగు సంవత్సరములు వారి ఉపాధి అరుణాచలంలో తిరుగాడిన కాలంలో భగవాన్ మనకు అందించిన అమృతబోధను కేవలం చదవడం, వినడమే కాకుండా ఆచరణలోనికి అనువదించుకోవాలి. మానవాళికి ఆరాధనీయుడు, మార్గదర్శకుడు అయిన భగవాన్ శ్రీరమణమహర్షి బోధతో స్ఫూర్తిని పొందినవారు నాటి నుండి నేటి వరకు అనేకులు ఉన్నారు. పరమ సత్యాన్ని "తాను"గా నిరూపించిన భగవాన్ శ్రీ రమణుల జీవితమే ఒక వ్యక్తిత్వ వికాస గ్రంథం. సమత్వమే ఊపిరిగా, దేశకాల హద్దులు లేకుండా తత్త్వ జ్ఞాన జిజ్ఞాసువులను అంతిమ సత్యంలోకి మేల్కొలుపుటకు వచ్చిన గురువు భగవాన్ శ్రీరమణ మహర్షి.

**- చావలి సూర్యనారాయణమూర్తి, టీచర్, అమలాపురం**

# పరిస్థితులు మన చేతుల్లో లేకపోయినా - ప్రవర్తన మన చేతుల్లో ఉంది

ఒకో సందర్భంలో మనకు ఇష్టంలేని సంఘటనలు జరిగి మన చేతుల్లో ఏమీ ఉండకపోవచ్చు ఆ సంఘటన గురించి ద్వేషించకుండా, దూషించకుండా అది ఈశ్వర సంకల్పం అనుకొని సమాధాన పడాలి. మనం మన పాపాలతోనే శిక్షించబడుతున్నాము అనే అవగాహనతో శాంతంగా జీవించాలి. జీవితం భారంగా ఉందని బాధపడకూడదు. బాధ వెనకాలే ఆనందం వస్తుంది. విసుగు ఉంటే అమృతస్థితి దొరకదు. మన చెమటను చిందిస్తే మార్చలేనిది ఏదీలేదు. 'విధి-విధి' అని ఏడవకూడదు. మన చేతుల్లో భగవంతుడు ఓడిపోవాలనే సంకల్పబలం నిజభక్తునికి ఉంటుంది. అనవసరపు సంఘర్షణలు, హృదా మనఃక్లేశాలు, మనోదౌర్బల్యాలు తొలగిపోతే ఈ ప్రపంచంలో సాధించరానిది అంటూ ఏమీ లేదు అనే నిశ్చయానికి రావాలి. వాసుదేవ స్వామి "నా ప్రియ భక్తులకు నేను మూడు వరాలు ఇస్తాను 1. దరిద్రము, 2. రోగాలు, 3. అపనిందలు" అన్నారు. శ్రీరామతీర్థ "మారు - లేదా నశించు" ఇది ప్రకృతి ధర్మయొక్క కఠిన శాసనం. పురోగమిస్తున్న కాలంలో కలిసినప్పడే జీవిత సంగ్రామంలో బ్రతకగలుగుతాము" అన్నారు. అంటే అంతస్తులు, పూర్వపు వైభవాలు మదిలో తలచుకొంటూ ఉంటే అధోగతే అని గ్రహించి గతాన్ని వదిలి వర్తమానంలో జీవించాలి. శ్రీనాన్నగారు "అంతా ఈశ్వర సంకల్పం ప్రకారం జరుగుతున్నది అని అనుకొంటున్నాము కాని ఉండగల్గుతున్నామా? కారణం వ్యక్తిభావన. మీరు ఎప్పడైనా కృంగిపోయారు అనుకోండి అది అంతా మీలో ఉన్న భ్రాంతికి, అజ్ఞానానికి, మనోశరీరాల వికారాల్లో ఉండి వికార రహిత స్థితిలో ఉంటే పరమాత్మను తెలుసుకొంటావు" అన్నారు. శక్తిని సరిగా వినియోగిస్తే నరకాన్ని కూడా స్వర్గంగా మార్చుకోవచ్చు. మన దుఃఖాలు అన్నీ పరస్పరం మన కోరికల వల్లనే వస్తున్నాయి అనే అవగాహనతో సుఖంగా జీవించాలి. ప్రతీ మహత్తర కర్మకూ వందలకొలది వేలకొలది, కష్టపరంపరలను సాధకుడు ఎదుర్కోవాలి. ఇవి అన్నీ భగవత్ సన్నిధానంలో ఉంచటానికి అని ఆనందప్రదంగా జీవించాలి. ఆనందానికి, తృప్తికి అత్యున్నత విలువ ఇయ్యాలి బాధను భరించాలి. గత జన్మలలో ఎంతో శిక్షణ ఆత్మ నిగ్రహం కలిగి ఉండబట్టే గురువు లభించాడని భావించాలి. ఆ మహాభాగ్యం వల్లనే నేను అదృష్టవంతుణ్ణి అని సాధకుడు భావించాలి. సంఘం మొత్తం వైరం ప్రదర్శించవచ్చు. దైన్యంగా చూస్తూ ఎన్నో బాధలు ఒకే సందర్భంలో పడాలి. ఎంతో చెడ్డపేరు రావచ్చు. దాన్ని త్యజించాలి. కష్టసుఖాలను పట్టించుకోకూడదు. గురు అనుగ్రహం కవచము దానితో మనం ఎంతటి విపత్తునైనా తేలికగా అధిగమించి కృతార్థులమౌతాము.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం**